క్లుప్తంగా

రోడ్డు ప్రమాద బాధితులను ఆదుకున్న ఎమ్మెల్యే కొఠారు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులను తన వాహనంలో వైద్యశాలకు పంపుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు/పెదవేగి: రోడ్డు ప్రమాదంలో గాయపడిన బాధితులను ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మానవత్వంతో స్పందించి ఆదుకున్నారు. ఆదివారం విజయరాయిలో కార్యక్రమాలు ముగించుకుని ఎమ్మెల్యే కొఠారు తిరిగి వెళుతుండగా ఏలూరు – చింతలపూడి రోడ్డులో గోడౌన్ వద్ద మోటార్ సైక్లిస్టును కారు ఢీకొన్న ఘటనను చూసి స్పందించారు. వెంటనే ఘటనా స్థలానికి వెళ్లి బాధితులు ఒంగూరు గ్రామానికి చెందిన దారుగ కౌశల్యారావు, తెనాలికి చెందిన కంతేటి సాంబశివరావు, వెంకటేశ్వరమ్మ దంపతులను తన కారులో ఎమ్మెల్యే ఏలూరు ప్రభుత్వ వైద్యశాలకు పంపించారు. వెంటనే డీసీహెచ్ఎస్‌కు ఫోన్ చేసి బాధితులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు.

బాదంపూడి దత్త క్షేత్రంలో దీపోత్సవం



దత్త సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో దీపోత్సవం

ఉంగుటూరు: బాదంపూడి దత్త బాలసుబ్రహమణ్యస్వామి ఆలయంలో కృత్తికా నక్షత్రం దీపోత్సవం ఆదివారం రాత్రి నిర్వహించారు. కృత్తికా నక్షత్రం కావడంతో ఆదివారం ఆలయంలో దీప సమర్పణ సేవ కార్యక్రమం నిర్వహించారు. దత్త బాలసుబ్రహమణ్యస్వామి భక్తులు పాల్గొన్నారు. ఆలయ చైర్మెన్ కవలచర్ల పర్యవేక్షించారు.

పాటెమ్మ ఆలయం వద్ద అగ్నిగుండం ప్రవేశం



పాటమ్మతల్లి ఆలయ ఆవరణలో అగ్నిగుండం తొక్కుతున్న భక్తులు

దెందులూరు: మండలంలోని చల్లచింతలపూడి పాటెమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అగ్నిగుండ ప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. యలమర్తి వారి ఆడపడుచు, గ్రామ దేవత పాటెమ్మ తల్లి ఆలయ ఉత్సవాల్లో భాగంగా భక్తులు నిప్పులపై అమ్మవారిని తలుచుకుని అగ్నిగుండం ప్రవేశం చేశారు. తొలుత ఆలయ ట్రస్ట్ బోర్డు ఛైర్మన్ యలమర్తి శ్రీనివాసరావు, పెరుగ్గూడెం మాజీ సర్పంచ్ హేమలత దంపతులు, అమ్మవారికి చీర సారెతో పాటు రూ.10లక్షలతో వెండి, బంగారు ఆభరణాలు అలంకరించారు. అగ్నిగుండం ప్రవేశానికి వివిధ గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పెరుగ్గూడెం సర్పంచ్ యలమర్తి రేవతి రామకృష్ణ, చల్లచింతలపూడి సర్పంచ్ బైగాని వెంకటేశ్వరమ్మ శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

డీజీ సునీల్‌కు జిల్లా రాష్ట్ర కో-ఆర్డినేటర్ల కృతజ్ఞతలు

దెందులూరు: దళిత క్రిస్టియన్‌లను ఎస్సీల్లో చేర్చేందుకు అంబేద్కర్ ఇండియా మిషన్ వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర ఫైర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ జనరల్ పీవీ సునీల్‌కుమార్ చేసిన కృషి అభినందనీయం అని ఎయిమ్ రాష్ట్ర , ఏలూరు జిల్లా కో–ఆర్డినేటర్లు పి.రాంబాబు, కె.రాంబాబు అభినందించారు. ఆదివారం సునీల్‌కుమార్‌ను ఆయన కార్యాలయంలో కో–ఆర్డినేటర్లు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా కో–ఆర్డినేటర్లు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దళిత క్రిస్టియన్ల విషయంలో తీసుకున్న నిర్ణయం చరిత్ర ఉన్నత కాలం దళిత క్రిస్టియన్లు కృతజ్ఞతగా ఉంటారన్నారు. దళిత క్రిస్టియన్లను ఎస్సీలో చేర్చాలని అసెంబ్లీలో ముఖ్యమంత్రి తీర్మానించడం రాష్ట్ర వ్యాప్తంగా దళిత క్రిస్టియన్లు, ఎయిమ్ సంస్థ స్వాగతిస్తుందన్నారు.

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

ఏలూరు (టూటౌన్): కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, కౌలు రైతుల సమస్యల పరిష్కారం కోసం, కేంద్రంలోని మోదీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం పేరిట జరుగుతున్న కార్మిక, కర్షక ఐక్యతా ర్యాలీని విజయవంతం చేయాలని కోరుతూ జిల్లా ప్రచార యాత్రను ఏలూరులో ఆదివారం ప్రారంభించారు.

అన్నదాతకు అండగా రైతు భరోసా కేంద్రాలు

- వలంటీర్ల నియామకాలతో సత్ఫలితాలు
- నిరంతరాయంగా రైతులకు సేవలు
- విత్తనం నుంచి పంట విక్రయం వరకూ అవగాహన కల్పిస్తున్న వలంటీర్లు



పత్తేపురంలో ఇటీవల నిర్మించిన రైతు భరోసా కేంద్రం



ధాన్యం తేమశాతం కొలవడంపై రైతులకు అవగాహన కల్పిస్తున్న వలంటీరు

నిడమర్రు: కష్టాల సేద్యం నుంచి కర్షకలను గట్టెక్కించేదుకు రాష్ట్ర ప్రభుత్వం పలు పథకాలను అమలు చేస్తోంది. పల్లె వాకిటే పుడమి పుత్రులకు సేవలు అందుబాటులోకి తేవడానికి ఇప్పటికే ప్రతీ గ్రామ సచివాలయం ప్రాంగణంలో డాక్టర్ వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేసింది. ఆ సేవలు మరింత మెరుగుకు ఇటీవల ఆర్బీకే వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి, ప్రతి కేంద్రంలో ఆ సచివాలయ పరిధిలోని ఓ వలంటీరును నియమించింది. ఫలితంగా అన్నదాతలకు అన్ని వేళలా ప్రభుత్వ సంబంధిత సేవలు అందుబాటులోకి వచ్చాయి. దీంతో రైతుకు మరింత భరోసా కల్పిస్తోంది రైతు భరోసా కేంద్రం. విత్తనం నుంచి చేతికందిన పంట విక్రయం వరకు వ్యవసాయానికి కావాల్సిన అన్ని రకాల సేవలను అందించే రైతు భరోసా కేంద్రాలు ఆర్బీకే వలంటీర్ల నియామకంతో మరింత బలోపేతమయ్యాయి.

ఒక్కో ఆర్బీకేకు ఒక వలంటీరు

వ్యవసాయానికి సంబంధించిన సందేహాలు తక్షణం నివృత్తిచేసి, వారి పంట విక్రయాల్లో ఎటువంటి సమస్యలు తలెత్తకుండా, ప్రభుత్వ పరంగా రైతులకు అందే సేవలు నిరంతరాయంగా అందించేందుకు ఒక్కో రైతు భరోసా కేంద్రానికి ఒక వలంటీరు నియమించింది. ఉంగుటూరు నియోజకవర్గంలో 63 ఆర్బీకేల్లో 63 మంది వలంటీర్లను ఎంపిక చేసారు. ఆయా గ్రామ సచివాలయ పరిధిలో చురుగ్గా పనిచేసే వలంటీర్లను లేదా ఇంటర్‌లో బయాలజీ సబ్జెక్ట్ చదివిన వలంటీరును డిప్యుటేషన్ విధానంలో ఈ ఆర్బీకేలకు ఎంపికచేసి వారికి అక్కడి కార్యకలాపాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. గత నెల నుంచి రైతులకు వలంటీరును అందుబాటులోకి తీసుకువచ్చారు. ఆర్బీకే వలంటీరును రైతు సహాయకులుగా పిలుస్తున్నారు. వీరికి నెలవారీ గౌరవ వేతనం మాత్రం సచివాలయం డీడీవో ఇస్తున్నారు.

ఇన్‌చార్జిలుగా వీఏఏ, వీహెచ్ఏ, ఏఎస్ఏలు

రైతు భరోసా కేంద్రాల ఇన్‌చార్జ్‌లుగా గ్రామ వ్యవసాయ సహాయకుడు (వీఏఏ), గ్రామ ఉద్యాన సహాయకుడు (వీహెచ్ఏ), గ్రామ సెరీకల్చర్ సహాయకుడు (వీఎస్ఏ) ఉన్నారు. అయితే వారు క్షేత్రస్థాయికి వెళ్లినప్పుడు ఆర్బీకే సేవలకు అంతరాయం కలుగుతోంది. ఈ–క్రాప్ బుకింగ్ కోసం రైతులు రోజుల తరబడి పొలాల వెంట తిరగాల్సిన పరిస్థితి వస్తోంది. ఆ సమయంలో ఆర్బీకేల వద్ద సేవలకు అంతరాయం కలగకూడదన్న ఉద్దేశంతో ఆర్బీకేలాకు వలంటీర్లు నియమించినట్లు అధికారులు చెపుతున్నారు. ప్రధానంగా సాగుకు అవసరమైన సేవలను రైతుల ముంగిటకు తీసుకు వెళ్లడమే ఈ రైతు సహాయకుని (ఆర్‌బీకే వలంటీరు) పాత్ర.

మండలంలో 14 మంది నియామకం



గ్రామాల్లో చురుగ్గా ఉన్న వలంటీర్లలో మండలంలో 14 మందిని ఎంపిక చేసి వారికి శిక్షణ పూర్తి చేసాం. డిజిటల్ కియోస్క్ ద్వారా ఎరువులు, విత్తనాలు, పురుగు మందులకు ఆర్డర్ నమోదు, పంపిణీ తదితర అన్ని కార్యక్రమాల్లో ఆర్బీకే ఇన్‌చార్జిల పర్యవేక్షణలో వలంటీర్లు చేపడతారు. ఎంపిక చేసిన వలంటీర్లను రైతు సేవకులుగా పిలుస్తున్నాం. వీరి నియామకంతో రైతులకు సేవలు మరింత చేరువయ్యాయి.

– బిన్సీబాబు థామస్, ఏవో, నిడమర్రు మండలం

ఆర్బీకే వద్ద అందుబాటులో ఉంటున్నాం



రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉంటున్నాం. ప్రభుత్వం ప్రతి రైతు భరోసా కేంద్రంలో ఇంటర్ పూర్తయిన ఓ వలంటీరును నియమించింది. ధాన్యం తేమ శాతంపై రైతులకు అవగాహన కల్పించడం తదితర అంశాలపై మాకు శిక్షణ ఇచ్చారు. ఆర్బీకేకు వచ్చిన రైతుకు అంతరాయం లేకుండా సేవలు అందిస్తున్నాం.

– పీఎం. బాబు, ఆర్‌బీకే వలంటీరు, బావాయిపాలెం

ఈ ప్రభుత్వంలో వ్యవసాయం ఓ పండుగలా



వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి రైతుకు వ్యవసాయం చెయ్యడం ఓ పండుగలా ఉంది. రైతుకు సంబంధించిన ప్రతి సమస్య గ్రామ ఆర్‌బీకే వద్దే పరిష్కారం అవుతున్నాయి. వలంటీరు నియమించడంతో వ్యవసాయ సహాయకులులేని సమయంలో రైతుల ప్రశ్నలకు సమా ధానాలు చెప్పే వారు అందుబాటులోకి వచ్చారు. ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం వల్ల మాకు ఎంతో మేలు కలుగుతోంది.

– నాగిశెట్టి సుబ్బయ్య, రైతు బావాయిపాలెం

దెందులూరు సీఎం సభ విజయవంతం



దెందులూరులో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మొక్క అందించి కృతజ్ఞతలు తెలుపుతున్న ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి, కొఠారు రామచంద్రరావు

దెందులూరు: దెందులూరులో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని వైఎస్సార్ సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి, దెందులూరు మండల పార్టీ అధ్యక్షుడు కామిరెడ్డి నాని అన్నారు. ఆదివారం శ్రీరామవరంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి, ఏపీ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, దెందులూరు నియోజవకవర్గంలో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు వైఎస్సార్ అభిమానులు సమష్టి కృషితో గతంలో ఎన్నడూ లేని విధంగా సభ విజయవంతమైందన్నారు. దెందులూరుకు ముఖ్యమంత్రి హోదాలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రావడం , రాష్ట్రంలో మహిళలందరికీ వైఎస్సార్ ఆసరా నిధులు బదలాయింపు చేసే రాష్ట్రస్థాయి కార్యక్రమానికి దెందులూరు వేదిక కావడంతో తమకెంతో సంతోషంగా ఉందన్నారు. వైఎస్సార్ ఆసరా సీఎం సభను విజయవంతం చేసిన అక్కాచెల్లెమ్మలు, వైఎస్సార్ సీపీ కుటుంబ సభ్యులందరికీ, వారం రోజుల పాటు అధికారిక విధులు నిర్వహించిన అన్ని ప్రభుత్వ శాఖల ఉద్యోగులు కామిరెడ్డి నాని కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయాల అభివృద్ధి, అర్చకుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం



పోలసానిపల్లిలో ఉగాది పంచాంగాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్

భీమడోలు: దేవాలయాల అభివృద్ధికి, అర్చకుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి పని చేస్తుందని దేవదాయధర్మదాయ శాఖ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు జ్వాలాపురం శ్రీకాంత్ అన్నారు. పోలసానిపల్లిలోని ప్రముఖ సిద్ధాంతి కాశీభట్ల కృష్ణప్రసాద్ శాస్త్రి ఇంటి వద్ద ఆదివారం ఆయన బ్రాహ్మణ సేవా సమాఖ్య రాష్ట్ర, జిల్లా శాఖల ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. తొలుత శోభకృత్ నామ సంవత్సర పంచాంగాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం గోశాలను సందర్శించారు. అనంతరం భీమడోలులోని గాయత్రి బ్రాహ్మణ భవనం సందర్శించారు. ఈ సందర్భంగా గాయత్రి బ్రాహ్మణ సేవా సమాఖ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సలహాదారుడు శ్రీకాంత్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆలయాల అభివృద్ధికి ఇతోధికంగా నిధులు వెచ్చిస్తుందని, అర్చకుల సంక్షేమమే ధ్యేయంగా చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. అర్చకులు ఎదుర్కొంటున్న సమస్యలన్నింటినీ పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ద్వారకాతిరుమలలోని వేంకటేశ్వర స్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అన్ని సదుపాయాలు కల్పిస్తామన్నారు. ద్వారకాతిరుమలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థం భీమడోలు రైల్వేస్టేషన్‌లో ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలిపే విధంగా అన్ని చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం శ్రీకాంత్ దంపతులను వారు దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సమాఖ్య జిల్లా ప్రధాన కార్యదర్శి కాశీభట్ల పార్వతీశ్వర శర్మ, వేద విజ్ఞాన పరిషత్ వ్యవస్థాపకుడు డీవీ బాలసుబ్రహ్మణ్యం, ప్రతినిధులు తోలేటి శ్రీనివాస్, సీఏపీఎస్ ఆచార్యులు, ద్రోణంరాజు వెంకటరమణ, పరిమి సీతారామ్, వీఎస్ మధుబాబు, జిల్లా పరిధిలోని ప్రముఖులు పాల్గొన్నారు.

పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదువుకోవాలి



బాలికల కళాశాల హాస్టల్‌లో మాట్లాడుతున్న బీసీ సంక్షేమాధికారి ఆర్‌వీ నాగరాణి

భీమడోలు: విద్యార్థులు పరీక్షలకు ప్రణాళికాబద్ధంగా చదువుకుని మంచి మార్కులను సాధించాలని జిల్లా బీసీ సంక్షేమాధికారిణి, సాధికారిక అధికారిణి ఆర్‌వీ నాగరాణి అన్నారు. భీమడోలులో బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలుర, బాలికల కళాశాలల హాస్టళ్లను ఆదివారం ఆమె ఆకస్మిక తనిఖీ చేసారు. మెనూ అమలును ఆమె పరిశీలించారు. హాస్టల్‌లోని సమస్యలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు పలు సూచనలందించారు. ఈ సందర్భంగా ఆర్‌వీ నాగరాణి మాట్లాడుతూ పరీక్షల వేళ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి ఒక్కరూ చక్కగా చదువుకుని ఉన్నత గ్రేడులను పొందాలన్నారు. ప్రభుత్వం హాస్టళ్లలో చదువుకుంటున్న విద్యార్థుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మెనూ అమలు చేస్తోందన్నారు. మెనూ అమలులో నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఆమె విద్యార్థులతో సహ పంక్తి భోజనాలు చేసారు. హాస్టల్ వార్డెన్లు టి.సాయిలీలా, ధనలక్ష్మి, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కుల పరిరక్షణకు కృషి చేస్తాం



చిన్నారులకు విద్యా సామగ్రి అందిస్తున్న మరడాని రాంబాబు, సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్

భీమడోలు: వినియోగదారుల హక్కుల పరిరక్షణకు తమ వంతు కృషి చేస్తామని ఎన్‌సీఆర్‌సీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు మరడాని రాంబాబు అన్నారు. పూళ్ల బాలికల వసతి గృహంలో ఆదివారం జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ ఆధ్వర్యంలో బాలికలకు అభ్యసనా సామగ్రి పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా అధ్యక్షుడు మరడాని రాంబాబు మాట్లాడుతూ వినియోగదారుల హక్కులను కాపాడుకునేందుకు కమిషన్ తమ వంతు సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. అనంతరం హాస్టల్‌లోని 66 మంది బాలికలకు ప్యాడ్స్, పెన్నులను ఉచితంగా పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ సుహాసిని, ఉపాధ్యక్షుడు తుమ్మూరి ఆంజ నేయులు, కోఆర్డినేటర్ కాసాని కృష్ణ పాల్గొన్నారు.

కాపు, తెలగ వర్గాలకు అండగా ప్రభుత్వం



ఎమ్మెల్యే ఆళ్ల నానికి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించిన కాపు, తెలగ సామాజిక వర్గం నాయకులు

ఏలూరు టౌన్: రాష్ట్రంలో కాపు తెలగ సామాజిక వర్గాలకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అండగా ఉంటారని, సమాజంలోని అన్ని వర్గాలకు మేలు చేయడమే లక్ష్యంగా ఆయన అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని అన్నారు. ఏలూరులోని క్యాంపు కార్యాలయంలో నగరంలోని 1, 2వ డివిజన్లకు చెందిన కాపు తెలగ సామాజికవర్గాల నాయకులు ఎమ్మెల్యే నానిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నగరంలో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి స్థలం కేటాయించాలని ఎమ్మెల్యే నానికి వినతిపత్రం అందజేయగా ఆయన స్థలం కేటాయింపుపై హామీ ఇవ్వటంతో వారంతా ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ.. కాపు తెలగ సామాజిక వర్గానికి స్థలం కేటాయిస్తానని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కాపు కార్పొరేషన్ ఏర్పాటు చేసి వెనుకబడిన కాపు వర్గీయులకు అండగా నిలిచారని తెలిపారు. సంక్షేమ పథకాల అమలులో మరో అడుగు ముందుకేసి మహిళల కోసం వైఎస్సార్ కాపు నేస్తం పథకానికి శ్రీకారం చుట్టారని తెలిపారు. కాపు సామాజికవర్గంలోని పేదలకు అండగా నిలుస్తూ ఏటా రూ.15 వేల చొప్పున ఐదేళ్లలో ఒక్కొక్కరికీ రూ.75 వేల ఆర్థిక సహాయాన్ని వైఎస్సార్ కాపు నేస్తం పేరుతో అందిస్తున్నారని తెలిపారు. కాపు బలిజ, తెలగ, ఒంటరి కులాల్లోని ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాల్లోని పిల్లల ఉన్నత విద్యకు సంబంధించి జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం ఒక వరం అని ఎమ్మెల్యే నాని చెప్పారు.

మానవత సభ్యుల సమావేశం

ఉంగుటూరు: డీసీసీబీ మాజీ చైర్మన్ దివంగత వట్టి వెంకటరంగ పార్థసారథి, భీమడోలు సుగర్స్ మాజీ చైర్మన్ సుంకవల్లి ప్రసాదరావుకు నివాళులర్పించారు. ఆదివారం నారాయణపురంలో మానవత సభ్యులు అధ్యక్షుడు సూర్యనారాయణరాజు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మృతుల కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అధ్యక్షుడు సూర్యనారాయణరాజు మాట్లాడుతూ రూ.25 వేలు ఆనంద నిలయానికి అందజేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మానవత రీజియన్ చైర్మన్ పుప్పాల గోపి, అడపా శ్రీనివాస్, బొమ్మిడి అప్పారావు, గంజి రవి, పుసులూరి ప్రకాష్, గురివెళ్లి రాజరావు పాల్గొన్నారు.

చదువు ద్వారా ఉజ్వల భవిష్యత్తు

భీమడోలు: చదువు ద్వారా నే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని భీమడోలు డైమండ్స్ లయన్స్ క్లబ్ అధ్యక్షుడు తుమ్మల వెంకట ఉమామహేశ్వరరావు, డాక్టర్ సత్యం ఫౌండేషన్ అధ్యక్షుడు బాలనాగు విజయసారథి అన్నారు. భీమడోలు, పూళ్ల, గుండుగొలను శాఖా గ్రంథాలయాల్లో చదవడం మాకిష్టం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. గ్రంథాలయాల్లో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన బాలబాలికలు సామూహిక పుస్తక పఠనంలో పాల్గొన్నారు. అనంతరం చిన్నారులకు పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథపాలకులు కేఎస్‌రావు, డీఎస్‌వీ అమర్‌నాథ్, జి.నాగమణి, పెద్దలు పీవీ రాఘవులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

పెదపాడు : చల్లో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ సీఐటీయూ, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం, ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం కళాజాత నిర్వహించారు. ఈ కళాజాత పెదపాడు మండలంలోని కొత్తూరు, కొత్తముప్పర్రు, పెదపాడు, నాయుడుగూడెం, సత్యవోలు, కొణికి గ్రామాలగుండా సాగింది. పెదపాడు సెంటర్‌లో నిర్వహించిన సభలో ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కే శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్రంలోని మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిరసించాలని పిలుపు నిచ్చారు. కార్మికులకు నెలకు కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. రైతుల పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టం తేవాలన్నారు. ఏప్రిల్ 5న ఢిల్లీలో నిర్వహించనున్న కార్మిక, కర్షక పోరాట ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్ లింగరాజు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పీ రామకృష్ణ, శ్రామిక మహిళ జిల్లా నాయకురాలు కే విజయలక్ష్మి, ఆవాజ్ జిల్లా నాయకులు షేక్ కరీముల్లా పాల్గొన్నారు.

దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించడంపై హర్షం

భీమడోలు: దళిత క్రైస్తవులను ఎస్సీలుగా గుర్తించాలని కోరుతూ రాష్ట్ర అసెంబ్లీ తీర్మానం చేసి కేంద్రానికి పంపడంపై కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం మండల కన్వీనర్ టి.సుమన్‌బాబు హర్షం వ్యక్తం చేసారు. భీమడోలులో ఆయన ఆదివారం మాట్లాడుతూ మతంతో సంబంధం లేకుండా దళితులందరినీ ఎస్సీల్లో చేర్చాలని నిర్ణయించడం శుభ పరిణామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం ద్వారా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగ సవరణ చేయాలన్నారు.

నూకాలమ్మ ఆలయంలో అన్నదానం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరంలోని వివిధ ఆలయాల్లో ఆదివారం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమాల్లో ఏలూరు నగరపాలక సంస్థ కో–ఆప్షన్ సభ్యుడు ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు. తొలుత స్థానిక 43వ డివిజన్‌లో ఇటీవల ముగిసిన శ్రీ నూకాలమ్మ అమ్మవారి జాతర మహోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం నిర్వహించిన అన్న సమారాధన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా తొలుత అమ్మవారికి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించి భక్తులకు అమ్మవారి ప్రసాదం పంపిణీ చేశారు.

నేడు సెంటర్ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ ప్రారంభం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): విద్యార్థుల్లో నిద్రాణంగా ఉన్న పాఠ్యేతర నైపుణ్యాలను, సృజనాత్మక ఆసక్తులను, సాహిత్య అభిలాషను వెలికితీసి వాటికి మరింత మెరుగుపెట్టి విద్యార్థులను కార్యోన్ముఖులను చేసే ఆలోచనతో నగరంలో సెంటర్ ఫర్ హ్యూమన్ ఎక్సలెన్స్ అనే సంస్థను ప్రారంభిస్తున్నామని నగరంలోని ప్రేమాలయం వృద్ధుల ఆశ్రమం అధ్యక్షుడు వెంకటేష్ గురూజీ తెలిపారు. ఆదివారం స్థానిక గో సంరక్షణ సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు సలక్షణమైన శిక్షణ ఇచ్చి వారిలో నైతిక విలువలు పెంపొందించే క్రమంలో ఈ సంస్థ తన కార్యాచరణను అమలు చేస్తుందన్నారు. ఈ కేంద్రంలో ప్రముఖ విద్యా, సామాజిక, మనస్తత్వ నిపుణుల ఆధ్వర్యంలో విద్యార్థులకు మానసిక వికాసానికి దోహదపడేలా తగిన శిక్షణా కార్యక్రమాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ కేంద్రాన్ని సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీ నారాయణ సోమవారం ప్రారంభిస్తారన్నారు. సమావేశంలో ప్రేమాలయం కార్యదర్శి ఎంఎస్‌వీ మురళీకృష్ణ, కార్యవర్గ సభ్యులు జీఎస్ వీవీ రామారావు, ఎంజీఎస్ వెంకటరత్నం పాల్గొన్నారు.

కోలాహలంగా చల్లాలమ్మ జాతర



కాళికా నృత్య ప్రదర్శన



చల్లాలమ్మ ఆలయ ప్రాంగణంలో గరగ నృత్యం చేస్తున్న ఆసాదులు

ఉంగుటూరు: ఉంగుటూరు గ్రామ దేవత చల్లాలమ్మవారి జాతర ఆదివారం రాత్రి కోలాహలంగా నిర్వహించారు. డప్పువాయిద్యాలు, బాణసంచా కాల్పులతో ఆలయ ప్రాంతం మార్మోగింది. వివిధ కళాకారుల ప్రదర్శనలు, ఆసాదుల గరగ నృత్యం, కళికా నృత్యాలు, శక్తి వేషాలు ఆకట్టుకున్నాయి. గ్రామంలో అమ్మవారిని ఊరేగించారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు శ్రీరెడ్డి శ్రీనివాసరావు, ఈవో కలగర శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు పెనుగొండ బాలకృష్ణ, సందక రాంబాబు, కమిటి సభ్యులు పర్యవేక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకుడు పుప్పాల చిన్నబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి, మండల కన్వీనర్ మరడ మంగరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ మరడ రమావతి, నెల్లూరు డీఎస్పీ సుధాకర్, వైఎస్సార్ సీపీ వీవర్స్ జిల్లా అధ్యక్షుడు దొంతంశెట్టి సత్యనారాయణ, ఏఎంసీ మాజీ చైర్మన్ కొండ్రెడ్డి సర్వేశ్వరరావు, మాజీ సర్పంచి పెనుగొండ సూర్యచంద్రరావు, వైసీపీ నేత మండ జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.